# రాగవల్లరి

ప్రభావతి ఆలోచనలో మునిగిపోయి సరోవరం వంక చూస్తోంది. అప్పటి వరకు తన చెంతనే వున్న స్నేహితురాలితో మనసులోమాట చెప్పుకొనే లేదు. ఇష్ట సఖులతో తప్ప తను మరెవరితో చెప్పుకోగలదు! వజ్రనాభుని కుమార్తె ప్రభావతి అంతఃపుర సమీప సరోవరంలో నిశ్చలంగా వున్న నీళ్లను చూస్తోంది. ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తోంది. కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. ఎర్రటి అధరాలు నీళ్ళలో అందంగా కనిపిస్తున్నాయి - రాత్రి వచ్చిన స్వప్నం ఒకసారి మనసులో మెదిలింది. మళ్ళీ, 'రాగవల్లరీ' - ప్రభావతి గొంతు ప్రతిధ్వనించింది.

పరిగెత్తుకుంటూ వచ్చిన చెలి పక్కనే నిలబడింది నవ్వుతూ, 'నీకెలా చెప్పాలో తెలియటం లేదు - అసలు కలో నిజమో తెలియటం లేదు - ఇలాంటి కలలు రావటం సాధ్యమా" - ఆ సరస్సు దగ్గిర నీటికై ఆగిన పక్షుల వంక చూస్తోంది ప్రభావతి. "నా దగ్గర ఏ రహస్యాలు దాచనన్నావు - త్వరగా చెప్పు - ఎవరికీ తెలియనీయకుండా నేను చూస్తాను." రాగవల్లరి ప్రభావతి చేయి పట్టుకొంది.

"అమ్మవారు పార్వతీదేవి వచ్చి నన్ను ప్రేమగా కౌగింలిచుకొని, నా శిరసునిమిరి -- ప్రభావతి మాట ఆపింది.

"ఉ, చెప్పు" - రాగవల్లరి ఉత్సాహంతో అంది. ప్రభావతి ముఖం వంచుకొని, ముసిముసిగా నవ్వుకొంది, బుగ్గల్లో సిగ్గు మంకెనల్లా నిండింది.

"నాకు కాబోయే భర్తను - రహస్యంగా చెప్పింది.

"ఆ - ఏమిటీ మళ్ళీ చెప్పు" - రాగవల్లరి కళ్ళు పెద్దవి చేసింది. అపురూప సౌందర్యం, శౌర్యం, పరాక్రమం, అన్నీ వున్న ఒక రాజకుమారుడి చిత్రపటాన్ని అప్పటికప్పుడు గీసి చూపించింది. అతడే నా భర్త అవుతాడంది అంతే కాదు ఇంకా -"

ప్రభావతి మాట ఆపి తన వెనక కదులుతున్న పక్షివంక చూస్తూ "ఇది మన మాటలు వింటోందా" అంది 'ఇంకానయం - పక్షులు మాటలు వినడమేమిటే - ఇంకా అమ్మవారు ఏమందో చెప్పు" - రాగవల్లరి తొందర చేసింది.

"రాజకుమారుని పేరు కూడ....." తెల్లని పలువరస అందంగా మెరిసింది. 'పేరు కూడ చెప్పిందా' - రాగవల్లరికి ఆశ్చర్యంగానే ఉంది ఇదంతా "ఆ - ప్రద్యుమ్నుడు" -

వెనకగా తిరుగాడుతున్న పక్షి రివ్వున ఎగిరి పోయిందంతే - 'చెలీ, నువ్వెంత ధన్యురాలవే - అమ్మవారు స్వయంగా చిత్రపటాన్ని లిఖించింది నీ భర్త ఇతడేనని చూపిందా - నీ అంత భాగ్యవంతురాలెక్కడుండదు సుమా' - రాగవల్లరి స్నేహితురాలనిని పట్టరాని ఆనందంతో కౌగిలించుకుంది.

అంతలోనే రాగవల్లరి ముఖంలో గంభీరత నిండింది. వినీలాకాశం వంక చూస్తూ ఆలోచనలో మునిగిపోయింది. ఒక్కసారిగా స్నేహితురాలిలో నిరుత్సాహం కనబడేసరికి ఖంగారు పడింది ప్రభావతి.

"నీ తండ్రి వజ్రనాభుడు ఎంత కఠినాత్ముడో నీకు తెలియంది కాదు కదా - మగపురుగులను అంతఃపురంలోనికి రానీయడు. ఈ చిత్రపటం విషయం తెలిస్తే మనల్ని బతకనిస్తాడా - పార్వతి అమ్మవారి వంకతో ఎవరో ఇలా చేసారని ఆగడం చేస్తాడు - ముందు నాతల తీయించేస్తాడు."

రాగవల్లరి మాటలు నిజమేననిపించి ప్రభావతి ముఖం వెలవెల పోయింది. -" రాగవల్లరీ, ఈ పని మూడో కంటికి తెలియకుండా నువ్వే ఏదయినా ఉపాయం చెప్పాలి' - రాగవల్లరి చేతులు పట్టుకొంది.

'అసలా చిత్రపటం ఎక్కడుంది. -

ప్రభావతి పొదరింటి చాటున ఉంచిన చిత్రపటాన్ని తెచ్చింది.

ఆ రాజకుమారుడు తమకేసీ చూస్తునట్లు చిరునవ్వు నవ్వుతున్నట్లు అనిపించింది. అలా చూస్తుంటే, - విశాలమైన కళ్ళు, దృఢమైన భుజాలు, తీర్చిదిద్దిన నాసిక - ప్రభావతి ఆపటం వంకే చూస్తోంది.

'ఈ చిత్రపటాన్ని పార్వతికాక మరెవ్వరు గీయగలరే - నీవు ఎంతో అదృష్టవంతురాలివే - రాగవల్లరి స్నేహితురాలి వంక చూస్తూ అంది.

ముందా చిత్రపటాన్ని జాగ్రత్తగా ఎవరికీ కనబడకుండా పొదరింటి లోపల దాచేసెయి. -- ఎవరైనా చూస్తారు" రాగవల్లరి ఆపటాన్ని భద్రంగా తీసి, పొదరింటి లోపల దాచేసింది.....

ఇక్కడ మనం ఎక్కువసేవు వుండద్దు పద," - స్నేహితురాలితో కదిలింది ప్రభావతి. ఆకాశం నిండా సంధ్యకాంతులు అలుముకున్నాయి.

అంతఃపురం చేరారిరువురు ఆ రాత్రంతా నిద్రరాలేదు ఇద్దరికీ రాజకుమారుడు తన కళ్ళ ముందు నుంచి కదలటం లేదు...తనతో శయనాగారంలో విశ్రమిస్తున్నట్లు, సంభాషిస్తున్నట్టు తలచి ప్రభావతి రాత్రంతా కన్ను మూయకుండానే గడిపింది.

రాగవల్లరికీ నిద్రరాక తన గదిలో అటు ఇటు కదిలింది. ఇంత కష్టమైన పని తనెలా నిర్వహించగలదో, వజ్రనాభుడికి తెలియకుండా - ఆ రాకుమారుణ్ణి అంతః పురంలో ఎలా ప్రవేశింప జేయగలదో - ఎక్కడ పొరబాటు జరిగినా తన బ్రతుకేమవుతుందో ఏమో! - రాగవల్లరి మనసు పరి పరి విధాల పోతోంది. -- ఆ ఆలోచనలతోనే తెల్లవారిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. - స్నేహితురాళ్ళిద్దరికీ ఉపాయం తోచడం లేదు. విరహవ్యధలో దుఃఖిస్తున్న స్నేహితురాలికి తనేం సాయంచేయలేక పోతున్నందుకు రాగవల్లరి మనసు ఎంతో వ్యధ చెందింది..... అమ్మవారే తనకేదో మార్గం చూపించకపోదనే ధైర్యం మాత్రం ఇంకా మనసులోనే ఉంది.

ఆ రోజు ఉద్యానవనంలో పొదరింటలో వున్న చిత్రపటాన్ని స్నేహితురాళ్ళిద్దరూ తిలకిస్తున్నారు. అంతలోనే ఆకాశం నుంచి కిందికి దిగిన హంస ఆ ప్రక్కనే వాలింది. అటు ఇటు తిరిగి ఆ చిత్రపటం వంక చూస్తూ నిలబడింది..... మళ్ళీ ప్రభావతి ముఖం వంక చూసింది..... మళ్ళీ ఆ పటం వంక చూసింది స్నేహితురాళ్ళకి ముచ్చటేసింది. ఆ పక్షిని చూస్తుంటే - పటంలోని మనిషి తనకీ తెలిసినట్లే చూస్తోంది చూడు అంది రాగవల్లరి - ప్రభావతి ఆ చిత్రపటాన్ని గబుక్కున తీసి గుండెలకి హత్తుకొంది.

"నిజంగానే ఇలాంటి పురుషుణ్ణి నేను చూశాను. అతనే ఇతనా అని ఆశ్చర్యంగా వుండి మళ్ళీ చూస్తున్నా" - హంస మాట్లాడుతుంటే చెవులను నమ్మలేక పోతున్నారిద్దరూ..... రాజహంస రాగవల్లరి దగ్గరగా వచ్చింది. రాగవల్లరి దాన్ని ఒళ్ళోకి తీసుకొని ముద్దాడి" నిజంగా చూసావా" అంది నెమ్మదిగా, 'చెప్పు ఎవరితను - రాజహంస రెక్కలు సవరించుకుంటూ అటు ఇటు కళ్ళు తిప్పింది... కొంచెం సేపాగి "అతను ద్వారకలో వున్నాడు రుక్మిణీ కృష్ణుల కుమారుడు..... రాజహంస ప్రభావతి వంక చూస్తూ అంది.

"ఆ వీరశృంగార మూర్తి ప్రద్యుమ్నుడు" - ఆ మాటలు పన్నీటి జల్లులైనాయి. రాగవల్లరికి తనపని కొంత తేలికైనట్లనిపించింది ఆక్షణం - మళ్ళీ క్షణంలో భయం వేసింది.

'ఈ పక్షికి ఇన్ని మాటలెలావచ్చా' అని - 'నీ పేరు" అడిది సంశయంగా "నాపేరు శుచిముఖి - నేను సరస్వతీదేవి దగ్గరుంటాను... అన్ని విద్యలు ఆమేనేర్పింది నాకు..... రెక్కలు విదిలించుకొని ఎగరబోతున్న పక్షిని గట్టిగా పట్టుకుంది. రాగవల్లరి పోనీయకుండా.

"శుచిముఖీ - ఇప్పటి నుంచి నువ్వు నా ప్రాణసఖివి..... నీదగ్గర ఏమి దాచను... ఈ పటాన్ని అమ్మవారు చిత్రించింది. - ఈ రాజకుమారుడే ఈమెకు భర్త అవుతాడంది..... శుచిముఖీ - ఈ పనిలో సహాయం చేయాలి" - రాగవల్లరి గొంతు గద్దదికమై, కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి....." నేను నిస్సహాయురాలను - నా స్నేహితురాలి ప్రాణం నిలబెట్టాలంటే ఈ రాజకుమారుని ఇక్కడికి తేవాలి. బతిమాలుతున్నట్లుగా, ప్రార్థిస్తున్నట్లుగా రాగవల్లరి హంస వంక చూస్తూ అంది. రాజహంస మౌనంగా ఊరుకొంది.

అంతలోనే ఎదురుగా చెట్టుపైన చిలక శుచిముఖి కోసం చూస్తున్నట్టుగా ఎదురు కొమ్మపై వాలింది. దాని కాలికున్న తాడు పట్టి లాగింది రాగవల్లరి - ప్రద్యుమ్నుడు ప్రభావతికి పంపిన ప్రేమలేఖ - స్నేహితులిద్దరూ విస్తుబోతున్నారు - రాజహంస ఆసక్తిగా ఇద్దరి వంక చూస్తోంది ప్రభావతి.

"ఒక్క సహాయం చేస్తే నీపని నిర్వహిస్తానంది" రాజహంస రాగవల్లరి వంక చూస్తూ "నీ స్నేహితురాలి తండ్రి సభలోనికి నన్ను పంపించు" -

"ఎలాగ" అంది ప్రభావతి వెంటనే.

"వజ్రనాభునికి చెప్పు నేను సమస్త శాస్త్రాలు, విద్యలు నేర్చానని - చక్కగా ఉపన్యసిస్తానని ... నన్ను రప్పించుకొనేట్టు చేయి"... నేను ఈ దగ్గరలోనే వుంటుంటాను" -

ప్రభావతి ముఖంలో ఆనందం పట్టరానిదైంది. తండ్రికి తనంటే ఎంత ప్రేమో తెలుసు."

వజ్రనాభుడి కుమార్తె మాటలు వింటూ పక్షి నిజంగా అంతగొప్పదా" అన్నాడు "ప్రభూ మీరొక సారి పిలిపించండి మీరే చూస్తారు" - రాగవల్లరి ఉత్సాహంగా అంటుంటే వజ్రనాభుడు తలూపాడు.

పక్షి వజ్రనాభుడి భవనంలో ప్రవేశించి తన విద్యలు చూపి రాజుని మెప్పించింది. అంతేకాదు భద్రనాభుడనే గొప్ప నటుడున్నాడని అతని బృందాన్ని పిలిపించండి - అతని నాట్యం ఆనంద పరవశుల్ని చేస్తుందని చెప్పింది హంస - రాజాంగీకరం వెంటనే దొరికింది. పక్షి పధకం ప్రకారం ప్రద్యుమ్నుడు భద్రనాభుని పేర రాజభవనంలో ప్రవేశించాడు. ఆటపాటలు విని వజ్రనాభుడు ఆనందించాడు.

ఆ రాత్రి అంతఃపురంలోనికి ప్రవేశించాలి ప్రద్యుమ్నుడు ప్రభావతికి ప్రద్యుమ్నుని ఎప్పుడు చూడగలనా అనే తహ తహ ఎక్కువైంది. అంతేకాక, ఏ ఆపదలు రాకుండా ఆ రాకుమారుడు అంతఃపురం చేరగలడా అనే భయం రాగవల్లరికి ఎక్కువైంది అదే సమయంలో. రాగవల్లరి స్నేహితురాలిని అలంకరించింది అందంగా చెక్కిళ్ళకు మకరికాపత్రాలు అద్దింది. నుదుటు కస్తూరి తిలకం తీర్చింది. పరిమళాలు వెదజల్లే రకరకాల పూలతో కేశాలం కరణ పూర్తి చేసింది. ఆభరణాల ధగధగలతో ప్రభావతి సౌందర్యం పట్టరానిదైంది – ఏక్షణాన రాకుమారుడు అంతఃపురం ప్రవేశిస్తాడో ఏమోనని ఎదురు చుస్తోంది రాగవల్లరి. క్షణంలో కామరూపంలో శయనాగారం ప్రవేశించిన ప్రద్యుమ్నుడిని చూసి నిలువెల్లా పులకించిపోయింది. ప్రభావతి బుగ్గల్లో సిగ్గు దొంతరలు తోసుకొస్తుంటే తలవంచి క్రీగంట చూస్తూ నిలబడింది.

"ఈ రాకుమారిని, మీ స్నేహితురాలిని గాంధర్వ వివాహం చేసుకుంటాను. ఇక్కడ సాక్షివి నువ్వే అన్నాడు ప్రద్యుమ్నుడు రాగవల్లరి వంక చూస్తూ – ప్రభావతి ప్రద్యుమ్నుని కౌగిట ఒదిగిపోయింది.

రాగవల్లరి మనసు తేలిక పడింది. స్నేహితురాలికిచ్చిన మాట నిలబెట్టుకుంది. వజ్రనాభుడి దగ్గర రహస్యం దాచగలిగింది. – తర్వాత ఏమవుతుందో ఏమన్నా కానీ – తేలిగ్గా ఊపిరి తీసుకొని ప్రభావతి అంతఃపురాన్ని దాటి, ఉద్యానవన సరోవరాన్ని చేరి వినీలాకాశాన్ని చూస్తూ కుర్చుంది రాగవల్లరి.

"కావ్యతారలు"